క్లుప్తంగా

దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కుంటాల: భూభారతి చట్టం అమలులో భాగంగా జిల్లాలో కుంటాల మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. భూసమస్యల దరఖాస్తులు స్వీకరించేందుకు మండలంలోని అధికారులు గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోనివారి కోసం తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఆదివారం రైతుల నుంచి ఏడు దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ కమల్ సింగ్, డీటీ నరేశ్‌గౌడ్ పేర్కొన్నారు. రికార్డ్ అసిస్టెంట్లు సాయన్న, ఆనంద్, వీఆర్ఏ సాయి తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రంలోనే అమ్ముకోవాలి

సారంగాపూర్: రైతులు తమ పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే అమ్ముకోవాలని సారంగాపూర్ ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ అన్నారు. ఆదివారం మండలంలోని జౌళి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నర్సయ్య, సత్యపాల్‌రెడ్డి, ముత్యం రెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

వ్యక్తి ఆచూకీ లభ్యం



ప్రశాంత్‌ను అప్పగిస్తున్న ఎస్సై సుప్రియ

లక్ష్మణచాంద: మండలకేంద్రానికి చెందిన బైండ్ల ప్రశాంత్ (25) ఇటీవల అదృశ్యం కాగా.. నిర్మల్‌లో ఉన్నట్లు తెలియడంతో ఆదివారం ఎస్సై సుప్రియ వెళ్లి కుటుంబసభ్యులకు అప్పగించారు. ప్రశాంత్ ఇటీవల ఇంటి నుంచి బయటకు వెళ్లి రాకపోవడంతో తండ్రి ఆనంద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రశాంత్‌ను అప్పగించినందుకు ఎస్సైకి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అల్పాహారం అందజేత

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కొనసాగుతున్న ఉచిత క్రీడా శిబిరంలో విద్యార్థులకు ఆదివారం అల్పాహారం అందజేశారు. పట్టణానికి చెందిన కస్తూరి మహేందర్ అనే హోటల్ నిర్వాహకుడు సొంత ఖర్చులతో అల్పాహారం ఏర్పాటు చేసినట్లు పీడీ ఇమ్రాన్ తెలిపారు.

ఎస్పీఎంలో కాపర్ వైర్ చోరీ

భైంసాటౌన్: పట్టణ శివారులోని ఎస్ఆర్ఆర్ గార్డెన్స్ సమీపంలోని ఎస్పీఎం(ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రం)లో భారీ చోరీ జరిగింది. కేంద్రం నిర్వాహకులు వినయ్‌రెడ్డి కథనం ప్రకారం.. శనివారం రాత్రి ఎస్పీఎంకు తాళం వేసి వెళ్లి ఆదివారం ఉదయం వచ్చి చూడగా వెనుకవైపు డోర్ తెరిచి ఉంది. ట్రాన్స్‌ఫార్మర్లలో అమర్చే దాదాపు రూ.ఏడు లక్షల విలువైన కాపర్ వైర్ చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి కేంద్రాన్ని పరిశీలించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నూతన స్టార్టర్ ఏర్పాటు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ పంచాయతీ పరిధి గంగాయిపేట గ్రామంలో మూడు నెలలుగా నెలకొన్న తాగునీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ వారెవరూ స్పందించలేదని మస్కాపూర్ మాజీ సర్పంచ్ మహేందర్ అన్నారు. ఆదివారం తన సొంత ఖర్చులతో నూతన స్టార్టర్‌ను ఏర్పాటు చేయించారు. ఉన్నతాధికారులు స్పందించి మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా ద్వారా నీటి సరఫరా పునరుద్ధరించాలని ఆయన కోరారు.

యువకుడికి సన్మానం



యువకుడిని సన్మానిస్తున్న నాయకులు

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన జాడి చంద్రకళ-గంగన్న దంపతుల కుమారుడు రంజిత్‌కుమార్‌ను ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇటీవల పట్టా అందుకున్నాడు. ఆదివారం నేతకాని సంఘ నాయకులు రంజిత్‌ను శాలువతో సన్మానించారు. దుర్గె వెంకటేశ్, చిన్నరాజన్న, బీఎస్పీ పార్టీ మండలాధ్యక్షుడు గంగాధర్, బోర్లకుంటరాజేశ్, నాగేష్, ప్రశాంత్, తదితరులున్నారు.



నిర్మల్‌చైన్‌గేట్ : సమ్మేళనంలో ఎస్ఎస్ఆర్‌కు చెందిన 2000-01 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు

ఉల్లాసంగా ఆత్మీయ సమ్మేళనం..

నిర్మల్‌చైన్‌గేట్/నిర్మల్‌ఖిల్లా/నిర్మల్‌రూరల్/భైంసారూరల్: నిర్మల్ పట్టణంలోని ఎస్ఎస్ఆర్ హైస్కూల్‌లో 2000-01లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పట్టణంలోని సిరి ఫంక్షన్‌హాల్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2000-03లో బీఎస్సీ ఎంపీసీ(డిగ్రీ) చదివిన పూర్వవిద్యార్థులు జిల్లాకేంద్రంలోని మారుతి ఫంక్షన్‌హాల్‌లో.. నిర్మల్‌రూరల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2009-10లో పదో తరగతి చదివిన విద్యార్థులు అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. భైంసా మండలంలోని తిమ్మాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2008-09లో పదో తరగతి అభ్యసించిన పూర్వవిద్యార్థులు అదే పాఠశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఏళ్ల కిందట విడిపోయిన మిత్రులు ఒకచోట చేరి ఆత్మీయంగా పలకరించుకొన్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకొని సందడిగా గడిపారు. తమకు విద్య నేర్పిన గురువులను మెమెంటోలు శాలువాలతో సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. అంతకుముందు భారత్-పాక్ యుద్ధంలో వీరమరణం పొందిన మన సైనికులకు సంతాపంగా మౌనం పాటించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



నిర్మల్‌లో సమావేశమైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2000-03 బ్యాచ్ విద్యార్థులు



నిర్మల్‌రూరల్ : రత్నాపూర్ పాఠశాలలో 2009-10 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు



భైంసారూరల్ : తిమ్మాపూర్‌లో సమావేశమైన 2008-09 బ్యాచ్ విద్యార్థులు

సంత.. సమస్యల చింత

- కుభీర్‌లో కరువైన సౌకర్యాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, చిరువ్యాపారులు
- వసతులు కల్పించాలని వేడుకోలు



కుభీర్‌లో రోడ్డుపైనే కొనసాగుతున్న సంత

కుభీర్: మండలకేంద్రమైన కుభీర్‌లో విఠలేశ్వరస్వామి మందిరం నుంచి బస్టాండ్ వరకు ప్రతి గురువారం నిర్వహించే వారసంత రోడ్డుపైనే కొనసాగుతుండటంతో ప్రజలకు, వాహనదారులకు, చిరువ్యాపారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం తైబజార్ వేలం నిర్వహిస్తూ.. ఆదాయం సమకూర్చుకుంటున్నారు. కానీ కనీస సౌకర్యాలు కల్పించడం లేదని వాపోతున్నారు.

సౌకర్యాలేవి..

ఈ సంతకు కుభీర్‌తోపాటు దొడర్నాలోని ఆరుతండాలు, సిర్పెల్లిలోని నాలుగు తండాలు, బెల్గాం గ్రామంలోని రెండు తండాలు, దార్‌కుభీర్, రాజురా, చొండి, కస్రా, పార్డి(కె), జమ్‌గాం, పల్సి, రంజని, రంజనితండా మహారాష్ట్రలోని పలు గ్రామాల ప్రజలు ఈ సంతకు వచ్చి సరుకులు కొనుగోలు చేస్తుంటారు. కానీ ఇక్కడ తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. దీంతో సంతకు వచ్చే మహిళలు ఒంటికి, రెంటికీ వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు..

ఈ రోడ్డు గుండా దొడర్నా, బెల్గాం గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులే కాక ప్రైవేటు వాహనాలు సైతం రాకపోకలు సాగిస్తుంటాయి. కుభీర్ బస్టాండ్ నుంచి గ్రామం బయటకు వెళ్లాలంటే ప్రజలకు ఇబ్బంది పడుతున్నారు. నాలుగేళ్ల కిందట కొత్తగా మండలంలోని పార్డి(బి), మాలేగాం గ్రామాల్లో వారసంత ఏర్పాటు చేశారు. పార్డి(బి)లో ఆదివారం, మాలేగాంలో ప్రతి బుధవారం సంత నిర్వహిస్తున్నా..అక్కడా సౌకర్యాల్లేవ్.

సౌకర్యాలు కల్పించాలి



వారసంత రోడ్డుపైనే కొనసాగుతుంది. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏటా వేలం నిర్వహిస్తున్నా చిరువ్యాపారులకు, ప్రజలకు తాగునీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ఎండకు, వానకు ఇబ్బంది పడుతున్నారు. – జగన్, కుభీర్

షెడ్లు నిర్మించాలి..



ప్రత్యేక స్థలంలో సంత నిర్వహణకు షెడ్లు నిర్మించి చిరు వ్యాపారులకు అప్పగించాలి. మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించాలి. ఈ దిశగా గ్రామపంచాయతీ వారు దృష్టి సారించాలి. – ఉప్పు దత్తాత్రి, కుభీర్

నీటి వసతి కల్పిస్తున్నాం

వార సంతలో చలివేంద్రం ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పిస్తున్నాం. మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించేందుకు గ్రామసభలో తీర్మాణం చేయించి సౌకర్యాలు కల్పిస్తాం. – మోహన్‌సింగ్, ఎంపీవో

'ఎప్‌సెట్'లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ

నిర్మల్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన ఎప్‌సెట్(ఇంజినీరింగ్, అగ్రికల్చర్-ఫార్మసీ విభాగం) ఫలితాల్లో జిల్లాకేంద్రంలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఇందులో ఫార్మసీ విభాగంలో సనైటాకు 1617వ ర్యాంకు రాగా, దీప్తిషైనీకి 2,535వ ర్యాంకు, ఎండీ ముసాదిక్‌కు 2,619వ ర్యాంకు, సుమయ్య ఖానామ్‌కు 6,887, ఎం.ప్రీతి 8,497, తహరీమ్ 9,202వ ర్యాంకులు సాధించారు. ఎంపీసీ విభాగంలో పుష్పాంజలి 10,528, శ్రీ భావన 17,684, సాహితి 29,017 ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.



1,617వ ర్యాంకు సాధించిన సనైటా



2535వ ర్యాంకు సాధించిన దీప్తి షైనీ

ఎప్‌సెట్ ఫలితాల్లో సత్తా



రిషిత్



అమన్

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్రస్థాయిలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ రంగాల్లో బ్యాచిలర్ డిగ్రీ ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్ ఫలితాలు ఆదివారం విడుదల కాగా జిల్లాకు చెందిన విద్యార్థి తొడిశెట్టి రిషిత్ ప్రతిభ చాటాడు. జిల్లాకేంద్రంలోని ప్రియదర్శినినగర్‌లో నివాసముండే అరుణ్‌కుమార్-విజయలక్ష్మి దంపతుల కుమారుడు రిషిత్ చిన్ననాటి నుంచే చదువుల్లో రాణిస్తున్నాడు. హైస్కూల్ విద్యను విన్నర్స్ పాఠశాలలో, ఇంటర్ హైదరాబాదులో పూర్తి చేశాడు. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 99.56 పర్సెంటేజ్ సాధించగా ఎప్‌సెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 296వ ర్యాంకు సాధించాడు.

లక్ష్మణచాంద: ఎప్‌సెట్ ఫలితాలలో మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎస్‌కే.హుస్సేన్-మైముద దంపతుల కుమారుడు అమన్ 82.86 మార్కులతో 2,034వ ర్యాంక్ సాధించాడు. దీంతో అమన్‌ను గ్రామస్తులతోపాటు పలువురు అభినందించారు.

కమనీయం.. నరసింహుడి కల్యాణం



భైంసాలో పూజలు చేస్తున్న భక్తులు



నగర్‌లో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

భైంసాటౌన్: పట్టణంలోని నర్సింహానగర్‌లో నరసింహస్వామి ఆలయంలో ఆదివారం నరసింహ స్వామి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పూజారులు ఉదయం నుంచే స్వామివారికి అభిషేకం, అర్చన, పూజాది కార్యక్రమాలు జరిపించారు. భక్తులు తరలివచ్చి పూజలు, ప్రత్యేక భజన కార్యక్రమాలు చేశారు. సోమవారం కల్యాణం నేపథ్యంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేయనున్నారు.

లోకేశ్వరం: మండలంలోని నగర్ గ్రామ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం లక్ష్మీదేవి- నరసింహుడి కల్యాణం కనుల పండువగా సాగింది. భక్తులు ప్రత్యేక పూజలు చేసి గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం జరిపించారు. కార్యక్రమంలో వేద పండితులు సంతోష్ జోషి, సురేందర్ జోషి, భక్తులు నరేందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, వసంత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి ఉన్నారు.



దస్తురాబాద్‌లో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

దస్తురాబాద్: మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం నరసింహస్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నరేశ్‌ఆచార్యుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలతోపాటు లక్ష్మీదేవి- నరసింహుడి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కోతుల దాడి



సీసీ కెమెరాలో రికార్డైన కోతుల దాడి

నిర్మల్‌టౌన్: ఓ వ్యక్తిపై కోతులగుంపు దాడి చేసిన ఘటన ఆదివారం జిల్లాకేంద్రంలో చోటు చేసుకొంది. వివరాల్లోకి వెళితే.. స్థానిక గాజులపేట్‌లో మొహమ్మద్ అన్వర్ తన ఇంటి ఎదుట ఉన్న కోతుల గుంపును బండరాళ్లతో కొట్టాడు. దీంతో అవి ఒక్కసారిగా అతడిపై దాడి చేసి గాయపరిచాయి. అనంతరం స్థానికులు కోతులను తరిమేసి అన్వర్‌ను ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రతిరోజు తమ ప్రాంతంలో కోతులు ఇబ్బంది కలిగిస్తున్నాయని స్థానికులు వాపోయారు. మున్సిపల్ అధికారులు స్పందించి కోతుల బెడదకు నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

జవాన్లకు మద్దతుగా పూజలు



పూజలు చేస్తున్న నాయకులు

లోకేశ్వరం: పాకిస్తాన్ దుష్ట శక్తిని అణిచివేసి భారత జవాన్లకు మరింత మహా శక్తిని ప్రసాదించాలని మండలకేంద్రంలోని శివాలయంలో బీజేపీ నాయకులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ బోడికె సాయన్న, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్, శ్రీధర్, రాజశేఖర్, కైరి శ్రీకాంత్‌గౌడ్ ఉన్నారు.

మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య



శ్రీకాంత్ మృతదేహం

నిర్మల్‌రూరల్: మద్యం మత్తులో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ ఎస్సై లింబాద్రి కథనం ప్రకారం..మండలంలోని ఎల్లారెడ్డిపేటకు చెందిన కల్లెడపు శ్రీకాంత్ (25) పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. ఇటీవల కొత్తగా ఇల్లు కట్టడంతో ఆర్థిక భారంతోపాటు అనారోగ్య సమస్యలు వచ్చాయి. దీంతో కలత చెంది ఆదివారం ఉదయం మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు గమనించి నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ సాయంత్రం మృతిచెందాడు. ఇతనికి వృద్ధులైన తల్లిదండ్రులు ఉన్నారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

జ్వరంతో ఒకరి మృతి

భైంసాటౌన్: పట్టణంలోని పిప్రికాలనీలో తీవ్ర జ్వరంతో ఒకరు మృతి చెందారు. కుటుంబీకుల కథనం ప్రకారం.. భైంసా మండలంలోని మాంజ్రి గ్రామానికి చెందిన విఠల్(65) కొన్నిరోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో భైంసా ఏరియాస్పత్రిలో చికిత్స పొందుతూ పట్టణంలోని తన కూతురు మల్లేశ్వరి వద్ద ఉంటున్నాడు. ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబసభ్యులు ఏరియాస్పత్రికి తీసుకురాగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

మాజీ సర్పంచ్ మృతి



లక్ష్మణ్ (ఫైల్)

సారంగాపూర్: మండలంలోని వంజర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ గోనె లక్ష్మణ్(45) ఆదివారం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. లక్ష్మణ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల ఆరోగ్యం కుదుట పడడంతో స్వగ్రామానికి చేరుకున్న ఆయన మళ్లీ చికిత్స కోసం హైదరాబాద్ వెళ్లాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలు

ముధోల్: మండలంలోని తరోడా గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుభీర్ మండలం రంగశివుని గ్రామానికి చెందిన వెంకట్‌పటేల్ అనే యువకుడు బాసర నుంచి భైంసా వైపునకు బైక్‌పై వెళ్తుండగా ముధోల్ మండలం తరోడా గ్రామ సమీపంలో గుర్తుతెలియని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకట్‌పటేల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించగా..వారు వచ్చి భైంసాకు తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

పిప్రికాలనీ సమీపంలో..

భైంసాటౌన్: భైంసా నుంచి నిర్మల్ వెళ్లే మార్గంలో పట్టణంలోని పిప్రికాలనీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. బీహార్‌కు చెందిన దీపుకుమార్ స్థానికంగా సిమెంట్ దుకాణాల్లో హమాలీగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక వైపు నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో దీపుకుమార్‌కు తీవ్ర గాయాలవగా స్థానికులు పట్టణంలోని ఏరియాస్పత్రికి తరలించారు.



కుస్లి వెళ్లే దారిలో కంపు కొడుతున్న ప్రధాన డ్రెయినేజీ



ఐదో వార్డులో చెత్తా చెదారంతో ప్రధాన డ్రెయినేజీ



జాతీయ రహదారి పక్కన పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

అధ్వానంగా పారిశుద్ధ్యం..

నర్సాపూర్(జి): మండలకేంద్రంలో 61వ జాతీయ రహదారి పక్కన పరిసరాలు చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. వార్డుల్లోని ప్రధాన డ్రెయినేజీల్లో మురుగునీరు నిలిచి ముందుకు సాగడం లేదు. దోమలు, ఈగలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. స్థానిక జనం చెరువులో చెత్తను పడేస్తూ కలుషితం చేస్తున్నారు. అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు వేడుకుంటున్నారు.